# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-07-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **దేశ యువత సృజనాత్మకతకు, ఆవిష్కరణ శక్తికి విక్రమ్-1 ప్రయోగం ప్రతీకగా నిలుస్తుందని మన్ కి బాత్ కార్యక్రమం 136వ సంచికలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడారు.**

2. **వర్షపు నీటిని సంరక్షించడం.. భావితరాల భవిష్యత్తుకు బలమైన పెట్టుబడి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.**

3. **దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్‌దివస్ జరుపుకుంటున్నాం.**

4. **మడ అడవులు తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ వెల్లడించారు.**

5. **రాష్ట్రంలో చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు.**

==========================

దేశ యువత సృజనాత్మకతకు, ఆవిష్కరణ శక్తికి విక్రమ్-1 ప్రయోగం ప్రతీకగా నిలుస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఆకాశవాణి ద్వారా మన్ కి బాత్, మనసులోని మాట కార్యక్రమం 136వ సంచికలో తన మనసులోని భావాలను ఈరోజు ఆయన ప్రజలతో పంచుకున్నారు. గత ఆదివారం విజయవంతమైన విక్రమ్-1 ప్రయోగం ప్రతి భారతీయుడికి గర్వకారణమైందని పేర్కొన్నారు. ప్రైవేటు రంగం అభివృద్ధి చేసిన తొలి రాకెట్‌గా విక్రమ్-1 చరిత్ర సృష్టించిందన్నారు. యువ శాస్త్రవేత్తలు, ఇన్నోవేటర్లు అసాధ్యాన్ని సుసాధ్యం చేసి తమ ప్రతిభ, పట్టుదల, ఓర్పును ప్రపంచానికి చాటిచెప్పారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కొనియాడుతూ..

వాయిస్…34 సెకన్లు

--------------------------

వర్షపు నీటిని సంరక్షించడం.. భావితరాల భవిష్యత్తుకు బలమైన పెట్టుబడి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధానమంత్రి 'క్యాచ్ ది రైన్' ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. వర్షపు నీటిని ఎక్కడ పడితే అక్కడే సంరక్షించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ ఉద్యమంలో నంద్యాల జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావడం విశేషమని చెప్పారు. అక్కడ పాత చెరువులను పునరుద్ధరించి తిరిగి వినియోగంలోకి తీసుకురావడం,

నీటి సంరక్షణకు ప్రజలు ముందుకు రావడం ఆదర్శంగా నిలిచిందన్నారు. అలాగే విజయనగరం పట్టణంలో కూడా ఈ ఉద్యమం ఉత్సాహంగా కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ..

వాయిస్...28 సెకన్లు

---

భారతదేశం తన సైనికుల సాహసంతో పాటు సాంకేతిక సామర్థ్యాలను కూడా నిరంతరం బలోపేతం చేసుకుంటోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన్ కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన, ఇటీవల భారత నావికాదళంలోకి చేరిన ఐఎన్ఎస్ మహేంద్రగిరి పూర్తిగా దేశీయంగా రూపకల్పన చేసి, భారతదేశంలోనే నిర్మించిన ఆధునిక యుద్ధనౌక అని తెలిపారు. ఇందులో 75 శాతానికి పైగా స్వదేశీ పరికరాలను వినియోగించడం ఆత్మనిర్భర్ భారత్‌కు నిదర్శనమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొంటూ..

వాయిస్...23 సెకన్లు

---

భారత యువ క్రీడాకారులు ప్రపంచ స్థాయిలో అద్భుత విజయాలు సాధిస్తున్నారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బ్యాడ్మింటన్‌లో జపాన్ ఓపెన్ టైటిల్‌ను గెలుచుకున్న తొలి భారతీయ మహిళగా పి.వి.సింధు నిలవడం దేశానికి గర్వకారణమని ప్రధానమంత్రి పేర్కొన్నారు. యునైటెడ్ కింగ్‌డమ్ లో జరుగుతున్న కామన్వెల్త్ క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి దేశానికి మరిన్ని విజయాలు అందించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో యువత మరింత ముందుకు రావాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.

---

దేశవ్యాప్తంగా ఈరోజు కార్గిల్ విజయ్‌దివస్ జరుపుకుంటున్నాం. కార్గిల్ యుద్ధంలో భారత సైన్యం విజయానికి గుర్తుగా ఈదివస్‌ను నిర్వహిస్తున్నారు. 1999 జూలై 26న కార్గిల్‌లో భారత త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. పాకిస్తాన్‌కు చెందిన ఉగ్రవాదులను భారతసైన్యం సమర్థంగా తిప్పికొట్టింది. కశ్మీర్‌లో పాగా వేయాలనుకున్న పాకిస్తాన్ ప్రయత్నాన్ని భారత జవాన్లు సమర్థంగా ఎదుర్కొన్నారు. పాకిస్తాన్‌పై భారత్ సాధించిన చారిత్రాత్మక విజయాన్ని స్మరించుకుంటూ భరతమాత కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లను తలుచుకుంటూ... ఈరోజు కార్గిల్ 'విజయ్ దివస్'గా దేశమంతటా జరుపుకుంటున్నాం.

---

దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమర జవాన్ల త్యాగం చిరస్మరణీయమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఈరోజు జరిగిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశ చరిత్రలో జూలై 26వ తేదీ ప్రత్యేక స్థానం కలిగిన రోజని, కార్గిల్ విజయ దినోత్సవం ప్రతి భారతీయుడిలో గర్వాన్ని నింపే సందర్భమని చెప్పారు. కార్గిల్ యుద్ధంలో ఎత్తైన పర్వతాలు, ప్రతికూల వాతావరణం, శత్రువుల సవాళ్లను ఎదుర్కొంటూ భారత సైనికులు అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. కార్గిల్ విజయ దినోత్సవం సందర్భంగా అమరవీరులకు ప్రధానమంత్రి నివాళులు అర్పించారు. దేశభక్తి, సైనికుల త్యాగం యువతకు స్ఫూర్తిగా నిలవాలని ప్రధానమంత్రి ఆకాంక్షించారు.

---

మడ అడవులు తీర ప్రాంతాలకు సహజ రక్షణ కవచమని, వాటి సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉప ముఖ్యమంత్రి కే. పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న 1,053 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని తుఫాన్లు, సముద్ర కోత, వాతావరణ మార్పుల ప్రభావం నుంచి మడ అడవులు రక్షిస్తున్నాయని తెలిపారు. సముద్ర జీవవైవిధ్యాన్ని కాపాడడంతో పాటు తీర ప్రాంత ప్రజల జీవనోపాధికి ఇవి కీలక ఆధారమని చెప్పారు. 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా గత రెండేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 7 వేల ఎకరాల్లో మడ అడవుల పునరుద్ధరణ చేపట్టినట్లు ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు వెల్లడించారు. 2026-27లో మరో 4 వేల ఎకరాల్లో మడ అడవులను అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో చేనేతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత తెలిపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో ప్రగడ కోటయ్య జయంతి కార్యక్రమం ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. 4 చేనేత సత్యాగ్రహ ఉద్యమాలు నిర్వహించిన పోరాట యోధులు ప్రగడ కోటయ్య అని కొనియాడారు. 200లకు పైగా చేనేత సహకార సంఘాలను కోటయ్య ఏర్పాటు చేశారని మంత్రి వివరించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం 2024 సంవత్సర ఖరీఫ్ పంటల బీమా బకాయిలను విడుదల చేసేందుకు సానుకూలంగా స్పందించిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు. ఇటీవల కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసి రాష్ట్ర రైతుల సమస్యలను వివరించామని, పెండింగ్ బీమా నిధుల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను తెలియజేశామని మంత్రి చెప్పారు. ఈ నేపథ్యంలో కేంద్రం సానుకూలంగా స్పందించిందని వెల్లడించారు. కేంద్రం నుంచి ఖరీఫ్--2024 పంటల బీమా నిధులు విడుదలైన వెంటనే అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేస్తామని మంత్రి తెలిపారు.

=====================